క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నూతన ఆర్డీఓగా డీఎస్ వెంకన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా పనిచేస్తున్న వాసం రామ్మూర్తి ఏటూరునాగారానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(టీడబ్ల్యు)గా బదిలీ అయ్యారు. కాగా ఏటూరునాగారం డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న డీఎస్ వెంకన్న స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ క్రాంతి తదితరులు వెంకన్నకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి నిబంధనల మేరకు బాధ్యతగా పనిచేస్తానన్నారు. విధి నిర్వహణలో అందరూ బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు.

జఫర్‌గఢ్ ఎస్సైగా రవియాదవ్..



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా నియమితులైన శీలం రవియాదవ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన మహేందర్ ఇటీవల నెక్కొండకు బదిలీ కాగా శీలం రవియాదవ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కాగా, ఎస్సైకి పోలీస్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

రఘునాథపల్లి ఎస్సైగా నరేష్ ..



రఘునాథపల్లి: రఘునాథపల్లి ఎస్సైగా దూదిమెట్ల నరేష్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసే ఎస్సై చాగర్ల రఘుపతి ఖానాపురానికి బదిలీ కాగా వరంగల్ వీఆర్‌లో పని చేస్తున్న ఎస్సై నరేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై నరేష్‌ను పోలీస్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిల్పూరు ఎస్సైగా ఎం.రాజేందర్..



చిల్పూరు: చట్టం విషయంలో ఇతరులు జోక్యం చేసుకోవద్దని, సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై ఎం.రాజేందర్ అన్నారు. చిల్పూరు మండల నూతన ఎస్సైగా గురువారం ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి తగాదాలు జరిగినా పెద్ద మనుషులు చేసే పంచాయితీ తీర్మానాలు చెల్లవని, నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వస్తే తగు న్యాయం జరుగుతుందని అన్నారు.

విధుల్లో చేరిన ఎస్సై రాజు



లింగాలఘణపురం: లింగాలఘణపురం మండల ఎస్సైగా చింత రాజు గురువారం విధుల్లో చేరారు. స్థానికంగా పని చేసిన ఎస్సై ప్రవీణ్ బదిలీ కావడంతో నర్సంపేట నుంచి బదిలీపై వచ్చిన ఎస్సై రాజు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు బదిలీపై వెళ్లిన ఎస్సై ప్రవీణ్‌కు శాలువా కప్పి వీడ్కోలు తెలుపగా విధుల్లో చేరిన ఎస్సై రాజుకు శాలువా కప్పి సన్మానం చేసి స్వాగతం పలికారు.

ఇంటింటికీ రేషన్ ఈకేవైసీ



బచ్చన్నపేట: రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ చివరి రోజు కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ డీలర్లు ఇంటింటికి వెళ్లి గురువారం ఈకేవైసీ చేయించారు. కొందరు ఈకేవైసీ చేసుకోవడానికి రేషన్ దుకాణాల వద్దకు రాకపోవడంతో మిషన్లను వారి ఇంటికి తీసుకెళ్లి వేలిముద్రలను తీసుకున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయితీల్లో వంద శాతం ఈకేవైసీ పూర్తయిందని రేషన్ డీలర్లు తెలిపారు.

కళావేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇమ్ము



కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన అందె ఇమ్ము కళావేదిక పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకమైనాడు. ఈ మేరకు అతనికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కళాకారుల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇమ్ము తెలిపాడు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



జనగామ రూరల్: ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో టీచర్లు



పాలకుర్తి: వావిలాలలో..

జనగామ రూరల్: మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం ఘనంగా స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేశారు. ప్రధానోపాధ్యాయుడుగా బి.సునిల్, ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విద్యాసాగర్, డీటీడీఓగా బి.కృష్ణ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లచ్చిరాం, జుంలాల్, రతన్, సరోజన, రాములు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వావిలాల పాఠశాలలో..

పాలకుర్తి: మండలంలోని వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాల హెచ్.ఎం, ఎంఎన్ఓ పోతుగంటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య పాల్గొని మాట్లాడారు. స్వయంపాలనతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని అన్నారు. విరాళాలు అందజేసి పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ఎంఈఐ గంట రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే పరిపూర్ణ వికాసం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట: విద్యతోనే పరిపూర్ణమైన వికాసం లభిస్తుందని, పట్టుదలతో కృషిచేస్తే జీవితంలో విజయాలు వరిస్తాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన వాణీ హైస్కూల్ సిల్వర్ జూబ్లీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. పదో తరగతిలో 10 / 10 జీపీఏ సాధించి పాఠశాలకు పేరుతేవాలని అన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రేలారే రేలా జానపద కళాకారుడు శివనాగులు పాటలు ఆహుతులను అలరించాయి. అనంతరం యాజమాన్యం శాలువాతో ఎమ్మెల్యేను సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత, వైస్‌ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, నాయకులు భాస్కరుని పృథ్వీరాజ్, బొడిగె చంద్రారెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, మూసిని రాజు, నూకల నర్సిరెడ్డి, శివరాత్రి రాజనర్సు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సంకల్పయాత్రను విజయవంతం చేయండి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి



పాలకుర్తి టౌన్: మాట్లాడుతున్న నాయకులు

బచ్చన్నపేట: బీజేపీ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) చేపట్టిన విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంకల్ప యాత్రలో మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు నారాయణస్వామి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 8 గంటలకు కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో పూజలను నిర్వహించి చేర్యాల మీదుగా బచ్చన్నపేటకు 10.30 గంటలకు యాత్ర చేరుకుంటుందన్నారు. అనంతరం 11 గంటలకు జనగామలో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. యాత్రలో అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. నాయకులు సద్ది సోమిరెడ్డి, దొంతుల చెంద్రమౌళి, జూకంటి గణేష్, గీస సందీప్, గద్ద రాజు, సందెల రాము, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ కోరారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు దుబ్బ రాజశేఖర్, పూసాల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్‌రావు, ఐర్నేని రామారావు, మారం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్ర నేడు(శుక్రవారం) స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రానున్నట్లు బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పూండ్రు నవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు రఘునాథపల్లిలో రోడ్‌షో, సాయంత్రం 3 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరుకానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సంస్కృతిని కాపాడుకోవాలి



అతిథులను సత్కరిస్తున్న నాయకులు

జనగామ: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడిపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య అన్నారు. జిల్లా కేంద్రం క్లౌం రోడ్డున ఉన్న వివేకానంద నగర్‌లో గురువారం నూతనంగా నిర్మించిన వివేకానంద సేవా సదన్ (సమితి) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో కల్చర్ మారిపోతుందని, పాశ్చాత్య సంస్కృతిని అలవర్చుకోవడంతో అనేక అనర్థాలకు దారి తీస్తోందన్నారు. విద్యార్థి దశ నుంచే గ్రామీణ, భారతీయ సంస్కృతిని ఆచరించేలా తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఎ.రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జపల్లి సుభాష్, మేక బాల సిద్ధయ్య, జీసీఎస్.రావు, కొత్తపల్లి రాజయ్య, కృష్ణమూర్తి, దొంతుల శేఖర్, చింతకింది సంతోష్, కంచర్ల పవన్‌కళ్యాణ్, కేవీఎన్‌ఎల్.రెడ్డి, బాల్‌నర్సయ్య, శివరాజ్ యాదవ్, గీతేష్ బజాజ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం

వివేకానంద సేవా సదన్ భవనం ప్రారంభోత్సవంతో జిల్లాలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమవుతాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సదన్ కార్యాలయంలో భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల సంపత్ కుమార్, జిల్లా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మద్దోజు రవితేజ, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ కో–కన్వీనర్ తాటి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్ ఆధ్వర్యంలో అసోసియేషన్ బాధ్యులు గురువారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఘన్‌పూర్‌కు సివిల్‌కోర్టు మంజూరు అయిందని, మూతబడిన ఘన్‌పూర్ ఎస్సీ బాలుర హాస్టల్ సముదాయాన్ని గుర్తించామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు నిర్వహణ నిమిత్తం అందుకు సంబంధించిన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. రవీందర్, పిల్లి కార్తీక్, బాబు, శర్మకుమారి ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన



పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటా సేకరించిన తడి, పొడిచెత్త వేరుచేయడం, పాఠశాలలో మధ్యాహ్న భోజనం వ్యర్థాలు, చాక్లెట్ పేపర్లు తదితరాలను ఎలా వేరుచేయాలో విద్యార్థులతో చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎండీ పర్వేజ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, రవి, గిరిజ, స్వరూపరాణి, వేణుగోపాల్, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, ఉమ పాల్గొన్నారు.

‘చలో మేడిగడ్డ’ను జయప్రదం చేద్దాం..

జనగామ: కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టి, ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు నేటి(శుక్రవారం) చలో మేడిగడ్డకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ, డీసీసీబీ చైర్మన్లతో తెలంగాణ భవన్ నుంచి మేడిగడ్డకు భారీ ర్యాలీగా బయలు దేరుతారన్నారు. పెంబర్తి కాకతీయ కళాతోరణం మీదుగా ఉదయం 9 గంటలకు ర్యాలీకి స్వాగతం పలుకుతామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు స్వాగతం పలికేందుకు తరలి రావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

గడ్డం సమ్మయ్యకు సన్మానం



పాలకుర్తి: పద్మశ్రీ అవార్డు గ్రహీత చిందుయక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను పాలకుర్తిలో గురువారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినపుడే కళలు మరింత వెలుగులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని సోమేశ్వర్, లొంక ఐలయ్య, మహేందర్ రెడ్డి, ఎడవెల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు..

దేవరుప్పుల: మండల పరిషత్ నూతన ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సన్మానంచి శుభాకాంక్షలు తెలిపారు. అనతంర వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పుల అనిల్ కుమార్, పత్తేపురపు శేఖర్, తోటకూరి రమేష్,చింత నిఖిల్,ఉప్పుల ప్రకాష్,కడారి అంజయ్య తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కార్యాకలాపాల నిర్వహణ రికార్డులు, పరిసరాల మౌలిక వసతులను పరిశీలించారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులుతో కలిసి పరిశీలించారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గాడిపల్లి సతీష్ కొద్ది రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. కాగా, గురువారం బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు సతీష్‌ను పరామర్శించి రూ. 15 వేల సాయం అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సతీష్‌కు తమవంతు సాయం అందించాలనే సంకల్పంతో సభ్యులంతా విరాళాలు పోగు చేసి అందించారు.

పలు గ్రామాల కాంగ్రెస్ కమిటీల రద్దు

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరు, కోలుకొండ, పెద్దతండా కాంగ్రెస్ గ్రామ కమిటీలను నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల లేకుండా ఎన్నుకున్నందుకు సదరు కమిటీలను రద్దు చేస్తున్నట్లు పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. అలాగే యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల అనిల్ కుమార్ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసినందుకు ఆ బాధ్యతలను నుంచి తొలగించినట్లు యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ మరొక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

కొడకండ్ల: రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన వద్దిరాజు రవిచంద్రను గురువారం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, నర్సింహస్వామి, శ్రీనివాస్, విక్రం, వెంకట్రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంటలను ఎండనీయం

చిల్పూరు: రైతులు వేసుకున్న పంటలను నీరులేక ఎట్టి పరిస్థితుల్లో ఎండనీయమని, అవసరమైతే దేవాదుల రిజర్వాయర్ నుంచి వెళ్లే పైపులైన్ గేట్ వాల్వ్‌లను విప్పి సాగునీరు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరను రైతులు కోరారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు గురువారం గేట్‌వాల్వ్‌లను విప్పి నీటిని మల్లంకుంట్ల, గార్లకుంట పొలాలకు అందే విధంగా చూశారు. నాయకులు దేవి తిరుపతిరెడ్డి, భిక్షపతి, బుచ్చి కొంరయ్య, రవీందర్‌రెడ్డి, ఇల్లందుల యాదగిరి, మాచర్ల రాజు, తిరుపతిరెడ్డి, రమేష్, రాజు, ఎల్లయ్య, వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం



చిల్పూరు: గ్రామ ప్రజలు, భక్తులు, దాతలు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జాతర విజయవంతంగా ముగిసిందని జాతర కమిటీ చైర్మన్ బొల్ల రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగట్టు–మబ్బుగుట్ట సమ్మక్క–సారలమ్మ తిరుగువారం సందర్భంగా పుట్ట వద్ద చైర్మన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాలు సమర్పించారు. లింగయ్య, మహేందర్, కుమారస్వామి, బాలరాజు, గణేస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

సొంతగూటికి ‘నిమ్మతి’ దంపతులు

● జనగామ రాజకీయంలో కీలక మలుపు



పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గంలో రెండు కీలక పదవుల్లో ఉన్న దంపతులు.. త్వరలో సొంత గూటికి(కాంగ్రెస్‌లోకి) చేరేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో విబేధించిన ఆ పార్టీకి చెందిన పలువురు ‘హస్తం’ నీడన చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జనగామ మండలం పెంబర్తికి చెందిన జెడ్పీటీసీ నిమ్మతి దీపిక, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ.. ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న నిమ్మతి దంపతులు ప్రజాబలంతో ముందుకు వెళ్తుండగా.. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వారిని బీఆర్‌ఎస్‌లోకి స్వాగతించారు. ఇద్దరికి కీలకమైన పదవులు కల్పించినా.. ముత్తిరెడ్డి వ్యవహరించిన తీరును చాలా సార్లు విబేధించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా పరపతి లేకుండా చేశాడనే ఆవేదన, ఆగ్రహం.. నేడు కాంగ్రెస్ సొంతగూటికి వెళ్లేలా చేస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆశీస్సులతో నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్న విషయం చర్చనీయాంశంగా మారింది. జనగామలో లేదా హైదరాబాద్ గాంధీభవన్‌లో చేరికకు సంబంధించిన సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

‘చాంబర్’ గౌరవ అధ్యక్షుడు గోపయ్యకు సతీ వియోగం



లక్ష్మి (ఫైల్)

జనగామ: జనగామ చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ, వాసవీమాత ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు, లయన్ పజ్జూరి గోపయ్య సతీమణి లక్ష్మి గురువారం మృతి చెందింది. గతకొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, చాంబర్ ఆఫ్ అధ్యక్షుడు పోకల లింగయ్య, ఆయా సంఘాల ప్రతినిధులు డాక్టర్ కల్నల్ భిక్షపతి, కన్నా పర్శరాములు, బుద్దా రమేష్, జైన రమేష్, మర్యాల అశోక్, పజ్జూరి లక్ష్మి నర్సయ్య, గజ్జెల నర్సిరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. పట్టణంలో నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నివాళి



జనగామ: జిల్లా కేంద్రం ధర్మకంచకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త, తాపీ కార్మిక సంఘం నాయకుడు అనందాసు సాల్‌మోన్ గురువారం మృతి చెందాడు. కాగా, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మిద్దెపాక స్టాలిన్, గాదెపాక ప్రసాద్, ఉడుగుల నర్సింగరావు, వంగపల్లి శ్యాం, తోట సునీల్, తిప్పారపు అనిల్, చింతల సాయి, శ్రావణ్, సాయిచరణ్, కృష్ణ, హరీష్, సిద్దు తదితరులు ఉన్నారు.

‘సీఎంపై కడియం వ్యాఖ్యలు సరికాదు’

స్టేషన్‌ఘన్‌పూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మెప్పు పొందేందుకు సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాదని, దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి గెలువాలని సవాల్ చేశారు. బిడ్డకు ఎంపీ టికెట్ కోసం సీఎంపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా అనుచిత వ్యాఖ్యలు మాని సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కోల శ్రీనివాస్, మధు, శేఖర్, ఏలియా, శ్రీనివాస్, వెంకటస్వామి, పాషా పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



స్టేషన్‌ఘన్‌పూర్: ఎల్‌ఈడీ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ స్వరూప



చిల్పూరు: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు గురువారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని ఛాగల్లు గ్రామంలో జెడ్పీ నిధుల నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లను గురువారం ఎంపీటీసీ కనకం స్వరూపగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీటీసీ మాట్లాడారు. గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి ఇటీవల రూ.4లక్షలతో సైడ్ డ్రెయినేజీ పనులు చేపట్టామని, అదేవిధంగా జెడ్పీ నిధులు రూ.1 లక్షతో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ కనకం రమేష్, భాస్కుల యాదగిరి, ఐలపాక శ్రీనివాస్, భాస్కుల కుమార్, శ్రీనివాస్, చందు, బిక్షపతి, సంజీవ, రాములు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు పనులు..

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలతో చేపట్టిన మట్టి రోడ్డు పనులను ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ గురువారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ కందుల రఘుపతి, గాదె జయపాల్‌రెడ్డి, తోకల వెంకట్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు..

మండలంలోని నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎంపీటీసీ శిరీష, జిల్లా నాయకుడు పాశం సురేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గురువారం పనులను చేపట్టారు.

విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దు



డీజే యజమానులతో మాట్లాడుతున్న సీఐ

పాలకుర్తి టౌన్: ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో డీజే యజమానులు ఊరేగింపుల్లో సౌండ్ సిస్టంలతో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పాలకుర్తిలో గురువారం డీజే యజమానుల పిలిపించి మాట్లాడారు. వార్షిక పరీక్షలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఎలాంటి సౌండ్ సిస్టంల ద్వారా ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి, సిబ్బంది రాజ్ కుమార్, శ్రీనివాస్, కుమారస్వామి, డి. శ్రీను పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తాచాటాలి



జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

రఘునాథపల్లి: నాగార్జునసాగర్‌లో ఈనెల 2 నుంచి జరిగే 70వ రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు రాణించి సత్తా చాటాలని ఆలిండియా రైల్వే కబడ్డీ కోచ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తోటకూరి గట్టయ్యయాదవ్ అన్నారు. గోవర్ధనగిరి క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపికైన జట్టుకు కొనసాగుతున్న ప్రత్యేక శిక్షణను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి టోర్నీలో నైపుణ్యం ప్రదర్శించి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వై.కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, కోశాధికారి ఎదునూరి ఉప్పలయ్య, సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.